ప్రజాశక్తి

శనివారం 1 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

బెర్తులు పిపిపిలోకి.. భూములు లీజుల్లోకి..

రూ.వేల కోట్ల విలువైన వైజాగ్ పోర్టు 7500 ఎకరాలపై కార్పొరేట్ల కన్ను
ఒక్కొక్కటిగా బెర్తులన్నీ ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగింత



విశాఖ పోర్టు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పోర్టు ట్రస్ట్ (విపిటి) తన సార్థక ప్రభుత్వ రంగ పోర్టు స్థానాన్ని నెమ్మదిగా కోల్పోయే ప్రమాదం దాదాపు దాపురించింది. 'ల్యాండ్ లార్డ్' హోదా పేరుతో వేల ఎకరాలు, కార్గో హేండ్లింగ్ బెర్తులు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. పోర్టులో 29 బెర్తులున్నాయి. దీంట్లో ఎస్‌పిఎం ఆయిల్ బెర్తును తీసెయ్యగా మిగతా 28లో 8 బెర్తులను 2023 వరకూ పోర్టు యాజమాన్యం పిపిపిలో ఇచ్చేసింది. త్వరలో మరో 5 బెర్తులను పిపిపికి పిలుస్తున్నారు. ఇదిలా ఉండగా.. లీజుకివ్వడం అంటే ప్రైవేటీకరణ కాదని తాజా మాజీ పోర్టు ఛైర్మన్ కె.రామ్మోహనరావు శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించడం గమనార్హం.

పెట్టుబడి కోసమేనా ?

ప్రైవేట్ పోర్టులతో పోటీకి తట్టుకుని నిలబడాలంటే పెట్టుబడులు, టెక్నాలజీ అవసరమని పోర్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి అత్యధిక బెర్తులు పోర్టు ఆధీనం నుంచి బయటకు వెళ్లిపోతున్న నేటి పరిస్థితుల్లో పెట్టుబడులు సంగతేమోగానీ కార్పొరేట్ల చేతుల్లోకి బెర్తులు వెళ్లిపోయి వారికి పోర్టుమీద నియంత్రణ పూర్తిగా వస్తోంది. బెర్తుల్లో ఉద్యోగుల సంఖ్యను కూడా ఆపరేటర్లు తగ్గించేయడం లేదా సరైన వేతనాలు కూడా ఇవ్వకుండా చాకిరీ చేయించుకునే పరిస్థితి రానుంది. పోర్టులోని సుమారు 8కి పైగా బెర్తుల్లో వందల సంఖ్యలో ఉండే కార్మికులకు కనీసం రూ.18 వేలు జీతం రాని పరిస్థితి ఉంది. ఈ బెర్తులన్నీ పిపిపి పేర జారిపోతే ఈ బెర్తుల్లో పోర్టుకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులను మిగతా చోట్ల సర్దుబాటు చేయడమో లేదంటే అక్కడే ప్రైవేట్ ఆపరేటర్ల పెత్తనం కింద నలిగిపోవడమో తప్పనిసరని ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు. అదానీ బెర్తును (ఈక్యూ-1), వెస్ట్ క్యూ - 6 బెర్తును పోర్టు స్వాధీనం చేసుకున్నాక కొన్ని నెలల పాటు పోర్టు నడిపినందున రూ.కోట్లలో లాభాలు వచ్చాయి. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ఒఅండ్ఎం కింద ఈ రెండు బెర్తులనూ పోర్టు యాజమాన్యం ఇచ్చేసింది. పోర్టు హైస్కూలు, ఆసుపత్రికి కూడా టెండర్లను పిలిచిన సంగతి తెలిసిందే.

భూములకు ఎసరు ?

విశాఖ నగరం చుట్టుపక్కలా పోర్టుకు చెందిన సుమారు 7500 ఎకరాలున్నట్లు తాజా మాజీ పోర్టు ఛైర్మన్ కె.రామ్మోహనరావు స్వయంగా వెల్లడించారు. ఇవన్నీ లీజు ప్రక్రియకు లోనుకావాల్సిందే. సుమారు రూ.లక్ష కోట్లకు పైగా విలువ కలిగిన ఈ భూములన్నీ రైల్వే లైన్ల పక్కన, నగరం నడిబొడ్డున ఉన్నాయి. సముద్ర తీరం, లోపల కూడా పోర్టు భూములున్నాయి. బెర్తులు పిపిపికి ఇస్తేనే ఆపరేటర్లు కార్గో (సరుకుల రాకపోకల) మిగతా 2లో..



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న ఐద్వా కార్యకర్తలు

స్ఫూర్తిదాయకం..ఉక్కు పరిరక్షణ ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ రెండేళ్లకుపైగా సాగుతున్న ఉద్యమం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 729వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తోందని, గత ఏడాది లాభాల్లో నడిచిందని మిగతా 2లో..

ట్రైబల్ సెల్ బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ట్రైబల్ సెల్‌ను బలోపేతం చేసి రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణతో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ట్రైబల్ సెల్‌కు సంబంధించి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరు, మిగతా 2లో..

రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్దపీట

వార్త 2లో..

'గ్యాట్ -2023' ప్రారంభం

వార్త 3లో..

రూ.415.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు

వార్త 2లో..



విశాఖ నగరంలో బైకు ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బైకు ర్యాలీలు వార్త 5లో..

పక్కాగా 'పది' పరీక్షలు

- అన్ని చోట్లా బల్లలు ఏర్పాటు
- పరీక్షా కేంద్రానికి ఒక ఎఎన్ఎమ్ నియామకం
- అందుబాటులో ఆర్‌టిసి బస్సులు
- పరీక్షకు సిద్ధమవుతున్న 22,232 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఈ నెల మూడు నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు కిందకూర్చొని పరీక్షలు రాయడానికి వీల్లేకుండా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. వివిధ యాజమాన్యాల పరిధిలోని 399 పాఠశాలలకు చెందిన 22,232 మంది విద్యార్థులకు పరీక్షలు రాసే 111 కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యమూ తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికి రెండుసార్లు పరీక్షా కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి, నోడల్ అధికారి పరిశీలించారు. సమాచార లోపం లేకుండా పరీక్షలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఐదు సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాంబిల్లి, రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కోనాంలోని ఎపి గిరిజన సంక్షేమ పాఠశాల, రాంబిల్లి మండలం, గనపర్తి, వి.మాడుగుల మండలం ఒమిలి జిల్లా పరిషత్ పాఠశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్‌ను, పరీక్షల నిర్వహణకు 1270 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పది పరీక్షలు రాసే విద్యార్థులు : 22,232 మంది
బాలికలు : 10,992 మంది
బాలురు : 11,240 మంది
ప్రయివేటు విద్యార్థులు : 1681 మంది
పరీక్షా కేంద్రాలు : 111
ఇన్విజిలేటర్లు : 1270 మంది
ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ : 5

పరీక్ష కేంద్రాల్లో తప్పనిసరిగా తాగునీరు, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్, పరీక్షలు రాయడానికి బల్లలు సిద్ధంచేశారు. విద్యార్థులకు సరిపడా బల్లలులేని కేంద్రాలకు సమీపంలోని పాఠశాలల నుంచి తెప్పించి ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. పోలీసు స్టేషన్, ట్రెజరీ కార్యాలయమున్న పరీక్ష కేంద్రాలను ఎ - కేటగిరిగానూ, ట్రెజరీగానీ, పోలీసు స్టేషన్‌లో ఏదోఒకటి ఉన్న పరీక్ష కేంద్రాలను బి - కేటగిరిగానూ, ఈ రెండూలేని 8 కిలోమీటర్ల పరిధిలోని పరీక్షా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బెర్తులు పిపిపిలోకి.. భూములు లీజుల్లోకి..

పట్ల ఆసక్తిగా ఉంటారని, పక్కనే ఉన్న అదానీ గంగవరం ప్రైవేట్ పోర్టు కంటే ధీటుగా ప్రగతి సాధించగలమని అధికారులు చెబుతున్నారు. మరోపక్క భూముల లీజుల వ్యవహారం విశాఖ పోర్టు పరిధిలో జరగలేదన్నది పోర్టు యాజమాన్యంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర పోర్టులు మంత్రిత్వశాఖ (ట్యాంప్) నిబంధనలకు శాలిగ్రాంపురంలో 8 ఎకరాలను ఇచ్చి ఉంటే రూ.500 కోట్ల వరకూ వచ్చేదని, కేవలం రూ.125 కోట్లకే పోర్టు యాజమాన్యం ఇవ్వడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2022-2023లో రూ.73.75 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి రూ.1700 కోట్ల ఆదాయాన్ని విపిటి ఆర్జించడం గొప్ప విషయమే అయినా.. నేటికీ ప్రైవేటు కత్తి వేలాడుతోంది.

పక్కాగా 'పది' పరీక్షలు

కేంద్రాలను సి - కేటగిరిగానూ గుర్తించి, సమర్థవంతంగా నిర్వహించడానికి పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రాథమిక చికిత్స కోసం ఎఎన్ఎమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాన్ని బట్టి పోలీసులను నియమించారు. సెల్‌ఫోన్లతో ఛీఫ్ సూపరింటెండెంట్ సహా ఎవరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడంలేదు. విద్యార్థులకు రవాణా ఇబ్బందుల్లేకుండా బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారుల దృష్టికి విద్యాశాఖాధికారులు తీసుకెళ్లారు. మ్యాపింగ్ చేసిన పాఠశాలలు, పరీక్షా కేంద్రాల జాబితాను ఆర్టీసీ అధికారులకు అందజేశారు. పరీక్షకు గంట ముందు కేంద్రానికి చేరేలా, పరీక్ష సమయం పూర్తయిన అరగంటలో బస్సు సిద్ధంగా వుండేలా బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు.

స్ఫూర్తిదాయకం..ఉక్కు పరిరక్షణ ఉద్యమం

తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలే ఈ దేశానికి పట్టుగొమ్మలు అని అన్నారు. అటువంటి సంస్థల కొమ్మలను బిజెపి ప్రభుత్వం విరిచేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే మహిళలకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.మణి, ఆర్.వరలక్ష్మి, ఎ.పుష్ప, కె.సంతోషం, బి.భారతి, డి.కొండమ్మ, సుజాత, ఆర్.విమల, కె.వేణు, బి.సత్యవతి, కామేశ్వరి, కె.లక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ట్రైబల్ సెల్ బలోపేతానికి కృషి చేయండి

అరుకులో కొత్తగా బ్లడ్ బ్యాంకులు నిర్మించాలని ఆదేశించారు. కెజిహెచ్‌లో ఎన్ఐసియు ను అభివృద్ధి చేసి, అదనపు ఎస్ఎన్‌సియు నిర్మించాలన్నారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ట్రైబల్ సెల్‌కు ఖరీదైన మందుల కొనుగోలుకు, కాంట్రాస్ట్ స్కాన్ చేయడానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అంబులెన్సుల సంఖ్యను పెంచాలన్నారు. అరుదైన రక్త నమూనాలకు సంబంధించిన సమస్యలను మంత్రికి వివరించారు. సమావేశంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రమేష్ కిషోర్ పాల్గొన్నారు.

రైల్వే డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి శుక్రవారం విశాఖపట్నం-రాయగడ సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. స్టేషన్లలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. జిమిడిపేటలో నిర్మించిన సబ్ సెక్షన్ పోస్టును, రాయగడ స్టేషన్ ఆవరణలో కెవిఎ సబ్‌స్టేషన్, జనరేటర్ బ్యాకప్‌లను ప్రారంభించారు. పలువురు ఆయనకు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

అను ఇనిస్టిట్యూట్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైద్య చికిత్సా రంగంలో అనేక అద్భుత విజయాలను సాధించిన అను ఇనిస్టిట్యూట్ వైద్యులు తాజాగా మరో అత్యంత అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. మోయా మోయా అనే అరుదైన వ్యాధితో పక్షవాతం బారినపడిన 11 ఏళ్ల బాలుడి మెదడుకు బైపాస్ సర్జరీ నిర్వహించి, అతడిని కోలుకునేలా చేయగలిగారు. ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను మహారాణిపేటలోని అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ సందీప్ తలారి వివరించారు.

డిఎస్ఒగా సుబ్బరాజు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిగా ఎన్.సుబ్బారాజును నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో పౌరసరఫరాల శాఖాధికారి (డిఎస్ఒ)గా పనిచేసిన కెవిఎస్ఎమ్.ప్రసాద్‌ను పరిపాలన కారణాల రీత్యా కొద్ది రోజుల క్రితం సరెండర్ చేయడంతో ఆయన స్థానంలో విశాఖపట్నం పౌరసరఫరాల సంస్థ జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సుబ్బరాజును నియమించారు.

రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్దపీట

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యా రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కెఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షా ఫలితాలను శుక్రవారం ఆయన విడుదల చేశారు. స్థానిక డాల్ఫిన్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెరిట్ ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఉన్నత విద్యా రంగంలో విద్యార్థులు అభివృద్ధి సాధించాలని, పరిశోధనల వైపు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రంలో 194 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు. కెఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌ల లో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా జాతీయ స్థాయిలో మెరిట్ విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ప్రవేశ పరీక్ష ద్వారా ఏటా రూ.100 కోట్లను స్కాలర్‌షిప్‌లుగా ఇవ్వడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. 17 సంవత్సరాలుగా 100 శాతం ప్లేస్‌మెంట్స్ సాధిస్తున్నామని, ఈ ఏడాది 60 లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీని సాధించిన విద్యార్థులు కూడా ఉన్నారని వెల్లడించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

రూ.415.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి ఆస్తి, ఖాళీ జాగా పన్నుల రూపేణా ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యానికి మించి వసూలు అయిందని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి పరిధిలో 5.59 లక్షల ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు ఉన్నాయని, వీటి ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం సుమారు రూ.415.50 కోట్లు మేర ఆస్తి పన్నులు వసూలయ్యాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ.324.24 కోట్లు మాత్రమే వసూలు జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.375 కోట్లు వసూలు లక్ష్యంగా నిర్దేశించామని, శుక్రవారం రాత్రి 7 గంటల వరకు రూ.415.50 కోట్లు వసూలు అయిందని, రాత్రి 12 గంటల వరకూ అన్ని సౌకర్య కేంద్రాలూ పని చేస్తున్నందున ఈ వసూలు ఇంకా పెరిగే అవకాశం ఉందని అన్నారు.

శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఫిబ్రవరి 20 నుంచి మార్చి 31 వరకూ హుండీలో వచ్చిన నగదు, బంగారం, వెండి మొదలగు కానుకలను శుక్రవారం లెక్కించారు అందులో నగదు హుండీ ద్వారా రూ.28,56,321, అన్నదానం హుండీ ద్వారా రూ.15.398 వచ్చింది. అదే విధంగా బంగారం, వెండి కానుకులూ వచ్చాయి. అమెరికన్ డాలర్లు 47, అరబ్ దిర్హమ్స్ 500 విరాళంగా వచ్చాయి. లెక్కింపు కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, కార్యనిర్వాహణాధికారి కె.రమేష్ నాయుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ కె.సింహాచలం, ధర్మకర్తలు బొడిలపాటి సత్య రూపవాణి, బి.వెంకటరత్నం ఎన్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వి.రాంబాబు, జగన్నాథ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం (శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం దత్తత దేవాలయం) హుండీ లెక్కింపులో రూ.5,59,376 నగదు వచ్చిందని రమేష్ నాయుడు తెలిపారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, సభ్యులు

ఎపిపిఎస్‌సి పరీక్షల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్లు, జూనియర్ లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాల నియామకానికి సంబంధించి శనివారం నుంచి ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో వ్యవహరించి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల నేపథ్యంలో వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి లోపాలూ తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయుష్ విభాగంలో చేపట్టే మెడికల్ ఆఫీసర్లు, లెక్చరర్స్/అసిస్టెంట్ ప్రొఫెసర్లు నియామకానికి సంబంధించి ఒకటో తారీఖు నుంచి మూడో తారీఖు వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయని, సుమారు 1283 మంది అభ్యర్థులు హాజరవుతారని డిఆర్ఒ వివరించారు. రెవెన్యూ విభాగంలో చేపట్టే జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ల నియామకానికి సంబంధించి ఏప్రిల్ నాలుగో తేదీన రెండు పూటలా పరీక్ష ఉంటుందని, 1250 మంది హాజరు కానున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ బాధ్యత వహించాలని, విద్యార్థులను బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చుదిద్ది మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కెకెవిబి.కృష్ణ తెలిపారు. శుక్రవారం డిఆర్‌డిఎ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలి

- రామచంద్రనగర్ వద్ద 16 గ్రామాల ప్రజలు ధర్నా
- రెండు గంటలపాటు నిలిచిన 150 చెత్త వాహనాలు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన

ప్రజాశక్తి - గాజువాక : రామచంద్ర నగర్ వద్ద నిర్మించిన డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని కోరుతూ 16 గ్రామాల ప్రజలు భారీ ధర్నా నిర్వహించారు. జెఎసి కమిటీ నేతల ఆధ్వర్యంలో రెండు గంటలకుపైగా ఆందోళన చేపట్టి, 150 చెత్తవాహనాలను దాదాపు రెండుగంటల పాటు నిర్బంధించారు.

ఈ సందర్భంగా జెఎసి సలహాదారులు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ముమ్మన మురళి, మంత్రి శంకర్ నారాయణ, ఎం.రాంబాబు, రంభ నారాయణమూర్తి మాట్లాడుతూ, స్వతంత్ర నగర్ వద్ద నున్న డంపింగ్ యార్డ్ వలన 16 గ్రామాల ప్రజలు దుర్గంధం, అనారోగ్యాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. గడచిన ఎనిమిదేళ్లుగా ఆయా గ్రామస్తులు ఇబ్బందులు పడుతూ, డంపింగ్‌యార్డు తరలించాలని ఐక్యవేదికగా ఏర్పడిన పోరాటకమిటీ ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. బాధిత గ్రామాల్లో ఇళ్లన్నీ రోగాల కొంపలుగా మారాయని, ఈ 16గ్రామాల్లో సొంతిళ్లు ఉన్నవారు తప్పితే బంధువులుగానీ, అద్దెకు ఉండేందుకు గానీ ఎవరూ రాని దయనీయ పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయా గ్రామాల్లోని పిల్లలకు వివాహాలకు ఈ డంపింగ్‌యార్డు అడ్డంకిగా ఉందంటే ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నారో స్పష్టమౌతోందన్నారు. ఇప్పటికైనా జివిఎంసి యంత్రాంగం స్పందించి, డంపింగ్ యార్డును తరలించకుంటే బాధిత గ్రామాల ప్రజలంతా మూకుమ్మడి నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ కన్వీనర్ డి రమణ, బి రామారావు, నాయుడు, గోవిందు, భాస్కరరావు, రామినాయుడు, సత్యనారాయణ, సన్నీ అప్పలరాజు, నాగేశ్వరరావు, సతీష్, శ్రీకాంత్, 16 గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



ధర్నాలో నినదిస్తున్న రాంబాబు, బాధిత గ్రామాల ప్రజలు

పోర్టు చైర్మన్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ కె. రామ్మోహనరావు సేవలు ప్రశంసనీయమని పోర్ట్ మాజీ సలహాదారు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్న రామ్మోహనరావును అక్కయ్యపాలెం పోర్ట్ కళావాణి ఆడిటోరియంలో ఘనంగా సత్కరించి సింహాద్రినాథుని జ్ఞాపిక బహుకరించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి ప్రాంతాల్లో సమర్థవంతమైన సేవలు అందించిన తర్వాత విశాఖ పోర్టు చైర్మన్‌గా ఐదేళ్ల ఉన్నతంగా సేవలందించి పోర్టును లాభాలబాట పట్టించిన రామ్మోహనరావు సేవలు ఎందరికో ఆదర్శనీయమన్నారు.

అడవివరం జెడ్‌పి హైస్కూల్‌లో ఆర్‌జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- సింహాచలం : అడివివరం జెడ్‌పి హైస్కూల్‌ను ఆర్‌జెడి జ్యోతకుమారి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. అకడమిక్, నాన్ అకడమిక్ రికార్డులను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఇచ్చిన బైజూస్ ల్యాప్‌ట్యాప్‌ల్లో విద్యాబోధన పై ఏ మేరకు అవగాహన ఉందో ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు ప్రభావతి మల్లికార్జునరావు పరీక్షలలో మంచి ఫలితాలను సాధించిన పదో విద్యార్థులకు సమకూర్చిన పెన్నులు, ఇతర పరికరాలను అందించారు హెచ్‌ఎం పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 8వ తరగతి విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు బైజూస్ ప్రీమియం యాప్స్ కలిగిన ట్యాబ్‌ల నిర్వహణపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు పాఠశాలలో ట్యాబ్‌లెతో విద్యాబోధన సందర్భంలో తలెత్తే సాంకేతిక సమస్యలను అధిగమించడమెలాగో శిక్షణ ఇచ్చారు.నోడల్ అధికారి సత్య నారాయణ, రి సోర్స్ పర్సన్లు, జి రవి, నాగేశ్వరరావు, ఎస్‌కె అల్లాఉద్దీన్, సోమయాజులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్లాస్టిక్ నిషేధంపై నరవ ప్రధాన రహదారుల్లో విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీధర్ పట్నాయక్ ప్రారంభించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ ప్లకార్డులు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ సంచులను నిషేధించి గుడ్డ సంచులు వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరు నాయుడు పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో విద్యుత్‌షాక్‌తో గాయాలపాలై చికిత్స అనంతరం కోలుకున్న జనసైనికుడు తాడివాడ అప్పలనారాయణకు పార్టీ తరఫున రూ.50వేలు ఆర్థికసాయాన్ని పార్టీ సమన్వయకర్త డాక్టర్ సందీప్ పంచకర్ల శుక్రవారం అందజేశారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈనెల్ 3 నుంచి 18 వరకు జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తిచేశామని డిఇఒ ఎల్.చంద్రకళ తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. విశాఖ జిల్లా అర్బన్‌లో 105, రూరల్‌లో 31 మొత్తంగా 136 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 27,547 మంది రెగ్యులర్, 1,739 మంది ప్రయివేటు విద్యార్థులతో కలిసి 29,286 మంది పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. వీరిలో 14,255 మంది బాలురు, 13,292 మంది బాలికలున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 9 సిట్టింగ్ స్క్వాడ్‌లు, మరో ఐదు అదనపు అధికారులను నియమించినట్లు తెలిపారు.

ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పాఠశాల యూనిఫాం, ఎలక్ట్రానిక్ పరికరాలతో రావడం నిషిద్ధమన్నారు.. మాల్‌ప్రాక్టీస్, పేపర్ లీకేజీలకు ఆస్కారం లేకుండా బార్ కోడింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులుంటే కంట్రోల్ రూం 94407 87228 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

డిఇఒ చంద్రకళ



ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ!

భీమునిపట్నం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోరని, విషయాన్ని గమనించి విద్యార్థులంతా నిర్దేశిత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఎంఇఒ కె.బాలామణి సూచించారు. ఉదయం 9.30గంటలకే పరీక్ష ప్రారంభమై, మధ్యాహ్నం 12.45వరకు కొనసాగుతుందన్నారు.

మండలంలో పదో తరగతి పరీక్షలకు పది కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇంగ్లీష్ మీడియం బాలురు 229 మంది, బాలికలు 364 మంది, తెలుగు మీడియం బాలురు 309 మంది, బాలికలు 312 మంది, అలాగే ప్రైవేట్ పరీక్షా కేంద్రాల్లో ఇంగ్లీష్ మీడియం 781 మంది బాలురు, 490 మంది బాలికలు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

నేత్ర పరిశోధనలో 'ఎల్‌వి ప్రసాద్'కు ఎనిమిదో ర్యాంకు

ప్రజాశక్తి - ఆరిలోవ : అగ్రస్థాయి నేత్ర పరిశోధనా సంస్థల్లో ఎల్‌వి.ప్రసాద్ నేత్ర పరిశోధనా సంస్థకు ప్రపంచంలోనే టాప్ టెన్‌లో చోటు దక్కింది. ఒక భారతీయ నేత్ర పరిశోధనా సంస్థకు ఈ స్థానం దక్కడం ఇదే ప్రథమం. స్పెయిన్‌కు చెందిన ప్రపంచ ర్యాంకింగ్ సంస్థ ఎస్‌సి ఇమాగో ర్యాంకింగ్ ఏజెన్సీ నేత్ర వైద్య, విజ్ఞాన సంస్థల పరిశోధనలు ఆధారంగా కేటాయించిన ర్యాంకుల్లో 2023 ఏడాదికి ఆప్తమాలజీ కేటగిరీలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞానసంస్థకు ప్రపంచంలోనే ఎనిమిదో ర్యాంకు, ఆసియాలో రెండో స్థానం దక్కింది. ప్రపంచ నేత్ర పరిశోధనా సంస్థల జాబితాలో భారతీయ నేత్ర ఆరోగ్య సంస్థ ఎల్‌వి ప్రసాద్ సంస్థకు చోటు దక్కడంపై గర్వపడుతున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం హర్షం వెలిబుచ్చింది.

భూఆక్రమణదారులను వదిలిపెట్టం

ప్రజాశక్తి-పద్మనాభం : ల్యాండ్ పూలింగ్ అక్రమార్కులు, చెరువుల కబ్జాదారులపై చర్యలు తీసుకునే వరకు విడిచిపెట్టేది లేదని మాజీ ఎమ్మెల్సీ మాధవ్ హెచ్చరించారు. శుక్రవారం వెంకటాపురం గ్రామంలో తొమ్మిది ఎకరాలున్న యాతవానిచెరువులో ఏడెకరాలు, నేరేళ్లవలస పంచాయతీలో 20 ఎకరాల విస్తీర్ణముండాల్సిన నేరేళ్ల చెరువులో ఐదు ఎకరాల కబ్జాకు బాధ్యులపై చర్యలకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల వలస చెరువున కబ్జా చేసి, కెవిఆర్ లేఅవుట్ వేశారని గ్రామ రైతులు, చిన్నాపురం సర్పంచ్ ఈగల శ్రీరామమూర్తి, సూర్యనారాయణ తదితరులు మాధవ్‌కు వివరించారు. పొట్నూరులో గవరరాజు చెరువు ఆక్రమణదారులు, బాధ్యులైన అధికారులను వదలబోమన్నారు. కొవ్వాడలో రైతు నుంచి రెండెకరాల భూమిని సేకరించినా పరిహారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్ రవికుమార్, ఆర్ శ్రీను ఉన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో ఎల్‌వి.పాలెం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 205, 276లోని ప్రభుత్వ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా కొంత మంది ఆక్రమించుకుంటున్నారని సామాజిక కార్యకర్త కోల హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ తహశీల్దార్ లోకవరపు రామారావుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాయబోతున్న మండలంలోని చిప్పాడ, అన్నవరం, పెద నాగమయ్య పాలెం పంచాయతీల్లోని 13 మంది టెన్త్, 37 మంది ఇంటర్ విద్యార్థులకు చిప్పాడ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో దివీస్ సిఎస్ఆర్ అధికారి నాగరాజు హాల్ టిక్కెట్లను అందజేశారు. చిప్పాడ దివీస్ సహకారంతో వీటిని అందించారు.

53వ వార్డులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి -కంచరపాలెం : 53 వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్‌లో వీ-టెక్ సంస్థ ఆధ్వర్యంలో ముస్లిములకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు, మహిళలకు ప్రత్యేక పానీయాన్ని అందజేసారు. కార్యక్రమాన్ని వీ-టెక్ సంస్థ డైరెక్టర్ షేక్ మదీనా వలి పర్యవేక్షించారు. మస్జిద్ కమిటీ అధ్యక్షులు మున్న, భాషా పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి

ప్రజాశక్తి - ఆరిలోవ : యువ చైతన్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరిలోవ టిఐసి పాయింట్ దరి భారతీ ఇంగ్లీషు మీడియం స్కూలులో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శుక్రవారం అందజేశారు.ట్రస్టు చైర్మన్ పిఐ బాలరాజు ఆదేశాల మేరకు ట్రస్టు సభ్యులు వీటిని అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం


ప్రజాశక్తి -తగరపువలస : విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని ప్రభుత్వ డైట్ అధ్యాపకులు ఎస్ త్రినాధరావు అన్నారు. శుక్రవారం జివిఎంసి ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతూ, విద్యాశాఖ నిర్దేశించిన కార్యక్రమాలను పాఠశాలల్లో సక్రమంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతం ప్రవేశ పరీక్ష 'గ్యాట్ -2023' ప్రారంభం

ప్రజాశక్తి- మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశాలకు జాతీయస్థాయి ప్రవేశపరీక్ష గ్యాట్-2023 శుక్రవారం ప్రారంభమైంది. అండమాన్ నికోబార్ దీవులతో సహ దేశవ్యాప్తంగా 139 కేంద్రాలలో ఏప్రిల్ 3వ తేదీ వరకు నాలుగు రోజులపాటు గీతం ప్రవేశపరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. 2023 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ (బిటెక్, ఎమ్‌టెక్), ఫార్మసీ (బి.ఫార్మసీ, ఎమ్.ఫార్మసీ), ఎమ్ఆర్క్, మేనేజ్‌మెంట్, లా, సైన్స్, హ్యూమానిటీస్, నర్సింగ్ పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు.

శుక్రవారం విశాఖలోని గీతం పరీక్షా కేంద్రంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్లు ప్రొఫెసర్ వై.గౌతమరావు, ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ ఆన్‌లైన్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతం విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న 153 పిజి, యుజి కోర్సులలో ప్రవేశానికి ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాయవలసి ఉంటుందన్నారు.

ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు ప్రకటించారు. గీతం ప్రవేశ పరీక్షల్లో, జేఈఈ మెయిన్ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో, ఏపి ఐసెట్ సెట్, తెలంగాణ ఎంసెట్ ప్రవేశ పరీక్షలతో పాటు జాతీయస్థాయి పోటీ పరీక్షలలో ర్యాంకులు సాధించిన వారికి ఫీజులో రాయితీ అందిస్తామన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామని తెలిపారు.




ప్రశ్నపత్రాల సెట్‌ను విడుదల చేస్తున్న గీతం ప్రొ వైస్‌ఛాన్సలర్లు

'ప్రజాశక్తి' ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్


ప్రజాశక్తి సిబ్బంది అందించిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

ప్రజాశక్తి- గాజువాక : ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ముద్రించిన పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లు, స్టడీమెటీరియల్‌ను శుక్రవారం గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, ప్రజాశక్తి సిబ్బంది ప్రసాద్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌కు ఘనసత్కారం


ఆనంద్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి -కరాస: పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా సత్కరించారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దుశ్శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఆనంద్‌కుమార్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని శ్రీధర్ ఆకాంక్షించారు.

తరలివెళ్లిన వైసిపి నేతలు

ములగాడ: ఏపి సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆడారి ఆనందకుమార్ ప్రమాణస్వీకారోత్సవానికి 60 వార్డు కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ కౌన్సిల్ సభ్యుడు పివి సురేష్, వైఎస్‌ఆర్‌టియుసి జోనల్ ఇన్‌ఛార్జి కలిదిండి బద్రీనాథ్ తదితరులు తరలివెళ్లారు.

సరిపల్లి కార్యదర్శిపై చర్యలు తీసుకోండి


కార్యదర్శి తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్, వార్డుసభ్యులు

ప్రజాశక్తి- పెందుర్తి : పంచాయతీ సర్పంచ్, పాలకమండలిని సంప్రదించకుండా ఏకపక్షంగా పంచాయతీ పారిశుధ్య కార్మికుల టెండర్ల ప్రక్రియను వాయిదా వేయడమే కాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సరిపల్లి పంచాయతీ కార్యదర్శి నాగసాయిని వెంటనే విధుల నుంచి తప్పించాలని సర్పంచ్ గొర్ల జగన్నాథ రామకృష్ణతోపాటు వార్డు సభ్యులు, స్థానికులు డిమాండ్ చేశారు. సర్పంచ్ గొర్ల జగన్నాథ రామకష్ణ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నారని, తాగునీటి పథకాలు, కుళాయిల నిర్వహణ టెండర్లను తెలియకుండా వాయిదా వేసారన్నారు. పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కావడంతో కక్షగట్టి ఇటువంటి చర్యలకు పూనుకుంటున్నాడని ఆరోపించారు.

స్టీల్‌ప్లాంట్‌పై

కేంద్రం కుట్రలను భగ్నం చేద్దాం


స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుకు ధారదత్తం చేయడానికి కేంద్రం చేస్తున్న ఆత్మహత్యా సదృశ్యమైన కుట్రలు, కుతంత్రాలను భగ్నం చేద్దామని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం సెంటర్ ప్లాంట్ విభాగం హెచ్‌ఒడి కార్యాలయం వద్ద స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున నినాదాలతో ధర్నా నిర్వహించారు. విభాగాధిపతి ముఖర్జీకి వినతిపత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సకాలంలో అందించే సామర్థ్యంతోపాటు నిధులను సమకూర్చాల్సిన బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం వైదొలగి స్టీల్‌ప్లాంట్‌ను బలవంతంగా వదులుకునే పరిస్థితులను కల్పిస్తోందన్నారు. దీన్ని అడ్డుకునేందుకు కార్మికులంతా ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపితే ఏటా రూ. 50 వేల కోట్ల ఆదాయంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.9 వేల కోట్లను అందించే సామర్థ్యం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్నప్పటికీ, కావాలనే భ్రష్టుపట్టిస్తున్నారని మండిపడ్డారు. వేతన ఒప్పందంతో ఏడాది క్రితమే సెయిల్ కార్మికులకు నూతనవేతనాలను అమలుచేస్తే, స్టీల్ ఉద్యోగులకు కావాలనే తాత్సారం చేస్తున్నారన్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటీ దాస్ మిత్రపక్షాల నాయకులు సిహెచ్ సన్యాసిరావు, ముగ్గేశ్వరన్ మాట్లాడుతూ సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తి భారం తగ్గి, అభివృద్ధిపథంలో దూసుకుపోయే పరిస్థితి ఉన్నా, రెండు దశాబ్దాలుగా మొండిచేయి చూపిస్తున్న పాలకుల నిర్ణయాలు, విధానాలను ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నేతలు కెవి సత్యనారాయణ, ఎమ్ఎస్‌వి ఉమామహేశ్వరరావు, ఎ.శ్రీనివాస్, కె.బాబురావు, పట్టా రమేష్, లింగేశ్వరరావు, సింహాచలం, డిఎస్‌ఆర్‌సి మూర్తి, త్రిమూర్తిబాబు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు కళాభారతిలో నాట్స్ జానపద సంబరాలు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -గాజువాక : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్), గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో), మాత కళా పీఠం సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 1న శనివారం కళాభారతిలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు తెలుగు జానపద సంబరాలు నిర్వహిస్తున్నట్లు గ్లో కార్యదర్శి వెంకన్న చౌదరి తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

నాట్స్ కన్వీనర్ అప్పసాని శ్రీధర్ మాట్లాడుతూ 'భాషే రమ్యావు సేవే గమ్యం' నినాదంతో , జన్మభూమికి చేతనైన సేవ చేయాలనే తలంపుతో జానపద కళకు విస్తృత ప్రాచుర్యం కల్పించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమంనిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీమాతా కళా పీఠం నిర్వాహకులు పల్లి నాగభూషణం, బిఎస్.మూర్తి పాల్గొన్నారు.

డిజిటల్ బోధనోపకరణాలు అందిస్తాం

గాజువాక :నాతయ్యపాలెం ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోధనకు అవసరమైన ఉపకరణాలను ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ద్వారా అందిస్తామని నాట్స్ కన్వీనర్ అప్పసాని శ్రీధర్ వెల్లడించారు. శుక్రవారం గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) ప్రతినిధులతో కలిసి పాఠశాలను సందర్శించారు. జన్మభూమికి సేవ చేయాలన్న తలంపుతో ప్రవాస తెలుగు వారంతా ఉత్తర అమెరికాలో నాట్స్‌గా ఏర్పడ్డామన్నారు. నాట్స్ తరపున నాతయ్యపాలెం పాఠశాలలో డిజిటల్ బోధనకు అవసరమైన రూ.60వేలు విలువ చేసే ప్రొజెక్టర్, స్క్రీన్, సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాట్స్ ఇండియా కోఆర్డినేటర్ ఎస్. రామానాయుడ, గ్లో కార్యదర్శి వెంకన్నచౌదరి, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.


విద్యార్థులకు మిఠాయిలు అందిస్తున్న నాట్ ప్రతినిధులు

అందుబాటులో ఎరువులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన


ఆర్‌బికెల్లో వ్యవసాయాధికారులు సిద్ధం చేసిన ఎరువులు

ప్రజాశక్తి- కె.కోటపాడు :రబీ సీజన్లో రైతులకు ఎరువులు కొరత అనే శీర్షికన శుక్రవారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచుతున్నట్లు చెప్పారు. యూరియా 91 మెట్రిక్ టన్నులు, డిఏపి 45 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 39 మెట్రిక్ టన్నులు, పటాస్ 27 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ ఎరువులు కెజె.పురం, సూదివలస, కింతాడ ఆర్‌బికె కేంద్రాల్లోనూ, కె.కోటపాడు, కె.సంతపాలెం, ఆనందపురం ప్రైవేట్ డీలర్ల వద్దనూ, కె.కోటపాడు కో-ఆపరేటివ్ సొసైటీలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అయితే మండలంలో 22 రైతు భరోసా కేంద్రాలు ఉండగా వ్యవసాయ అధికారి చెప్పిన కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. చౌడవాడ, గుల్లేపల్లి, రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల, గొండుపాలెం ఆర్‌బికె కేంద్రాల పరిధిలో ప్రస్తుతం వరి సాగుతో పాటు నువ్వులు, పొద్దుతిరుగుడు, చెరకు మొదలగు పంటలు సాగు చేస్తున్నారు. ఈ కేంద్రాల పరిధిలో ఉన్న రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో లేవు. అవసరం ఉన్న చోట ఎరువులు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అవసరం ఉన్న ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారి సోమశేఖర్ తెలిపారు.

2న వార్షిక కల్యాణోత్సవం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే పచ్చటి పందిళ్లు కళ్యాణ వేదిక సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలతోపాటు కొండదిగువన విద్యుత్ అలంకరణ చేశారు. రథయాత్ర కోసం రథాన్ని సిద్ధం చేసి పరిశీలన జరిపారు. భక్తులు వీక్షించేందుకు వీలుగా భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అన్న ప్రసాద వితరణకు సిబ్బందిని సిద్ధం చేశారు. కొండపైకి చేర్చేందుకు బస్సులను సిద్ధం చేశారు. భక్తులకు ప్రసాదాన్ని స్వామి కల్యాణ అక్షింతలను సర్వం సిద్ధం చేశారు ఉచిత వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్య కల్పన, పోలీసు భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాటు చేశారు భక్తులకు కావలసిన మంచి నీటి సదుపాయాన్ని కల్పిస్తున్నారు ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ భద్రత ఏర్పాట్లు కావించారు

శిశుగృహలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖ ఆర్అండ్‌బి జంక్షన్ దరి స్త్రీశిశు సంక్షేమశాఖ శిశు గృహలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్‌పి. జిస్వరూపారాణి నేతృత్వంతో శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించారు. నగరంలో ఆరు బృందాలుగా వృద్ధాశ్రమం, పాపాహోం, ప్రేమసమాజం, కెజిహెచ్ అడిటోస్ సెంటర్, మెంటల్ కేర్ హాస్పిటల్ పెద్ద వాల్తేరు రెడ్‌క్రాస్ సొసైటీలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రేవతి, ఎఇ రామ్‌గోపాల్, సీనియర్ అసిస్టెంట్ పద్మావతి ఉన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- భీమునిపట్నం: స్థానిక కెజిబివి పాఠశాలలో ఆరవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో ప్రవేశాలకు ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గంగాకుమారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ బైపిసిలో 40 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆరో తరగతిలో ప్రవేశానికి https://apkgbv.apcfss.in, ఇంటర్‌లో ప్రవేశానికి https:// bit.ly/kgbv -inter వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తహశీల్దార్‌గా శ్రీవల్లి

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం రెగ్యులర్ తహశీల్దార్‌గా తోట శ్రీవల్లి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సిసిఎల్ కార్యాలయంలో సూపరెంటిండెంట్‌గా విధులు నిర్వహించిన ఆమెను పద్మనాభం తహశీల్దార్‌గా నియమించగా విధుల్లో చేరారు. ఇప్పటివరకు తహశీల్దార్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌ఛార్జిలే బాధ్యతలు నిర్వహించారు.

ఇల్లంతా పసుపుమయం


పసుపు పచ్చని పూలతో కమ్ముకున్న ఇల్లు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ నుంచి ఆనందపురం వైపు వెళ్లే జాతీయ రహదారిలో ఆనందపురం కూడలికి అతి సమీపంలో ఉన్న ఒక ఇల్లు నిండా పసుపుదనంతో కళకళలాడుతోంది. ఇంటిపై అల్లుకున్న లతలు, ఇంటి పైకప్పును కప్పేస్తూ, చుట్టూ గోడలు సైతం కనిపించనంతగా అల్లుకున్న పసుపుపచ్చని పూలతో ఆ ఇంటిని చూడాలంటే చూడముచ్చటగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణించేవాళ్లంతా పసుపు పూలదండలతో అలంకరించినట్లున్న ఆ ఇంటివైపు కన్నెత్తి చూడకుండా వెళ్లని పరిస్థితి ఉండగా, అనేక మంది అక్కడ ఆగి పూల అందాలను ఆస్వాదిస్తూ పరవశించిపోతున్నారు.

చలో ఢిల్లీ జయప్రదానికి బైక్ ర్యాలీలు



గాజువాకలో బైక్ ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు



తగరపువలసలో...

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5న చలో ఢిల్లీ ఆందోళన, ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పలుచోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి- గాజువాక : ప్రభుత్వ రంగసంస్థలకు కార్పొరేట్లకు ధారదత్తం చేయడం, కార్మిక చట్టాలను కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాయడం, అధిక ధరలు, ఇతర ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ ఆందోళన జయప్రదంచేయాలని కోరుతూ గాజువాకలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నగర కమిటీ సభ్యుడు రాంబాబు, గాజువాక ప్రధాన కార్యదర్శి ఎ.లోకేష్, వైస్ ప్రెసిడెంట్ అప్పారావు, సహాయ కార్యదర్శి సురేష్, గణేష్, నానాజీ పాల్గొన్నారు.

తగరపువలస : చలో ఢిల్లీ జయప్రదాన్ని కాంక్షిస్తూ సిఐటియు భీమిలి జోన్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం నుంచి జంక్షన్ మీదుగా తాతా థియేటర్ వరకు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, నాయకులు ఎస్ అప్పలనాయుడు, ఎస్ శ్రీనివాసవర్మ, ముద్దాడ రాము, ముఠా కార్మికులు పాల్గొన్నారు

పెందుర్తి : 5న చలో ఢిల్లీ ఆందోళన జయప్రదం చేయాలని కోరుతూ పెందుర్తిలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా నేత జగన్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను విడదీస్తూ నిరంకుశ పాలన సాగిస్తోందన్నారు. సిఐటియు జోన్ కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ కార్మికచట్టాలను కోడ్‌లుగా సంస్కరించి యజమానులకు కార్మికులను కట్టుబానిసలు చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎన్.శంకరరావు, జగన్నాధస్వామి, అప్పారావు, ప్రకాష్, బిటి మూర్తి, సిపిఎం జోన్ కార్యదర్శి బి. రమణి పాల్గొన్నారు.

ములగాడ : చలో ఢిల్లీ జయప్రదానికి సిఐటియు మల్కాపురంజోన్ కమిటీ ఆధ్వర్యంలో సింధియా నుండి జింక్ గేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మల్కాపురంజోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ చలో ఢిల్లీ ఆందోళన జయప్రదంతో కేంద్రానికి కనువిప్పు కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు , షిప్‌యార్డు ఎంప్లాయస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షుడు కె.జానకిరామ్ బిఎస్ఎన్.రాజా, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, రాంజీ, అంబేద్కర్, వి.ప్రసాద్, హెచ్‌పిసియల్ యూనియన్ నేతలు నాగచైతన్య, దిలీప్, జివిఎంసి యూనియన్ నేతలు కె.రమణ బి.సూరిబాబు పెన్షనర్స సంఘం నాయకులు బి.తాతాజీ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు జగదాంబ జోన్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరంలో బైకు ర్యాలీ చేపట్టారు. ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడారు. తొలుత ఈ బైకు ర్యాలీని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మీసాల హరి, ఎం.సుబ్బారావు, శ్రీకాంత్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు. టిఎస్ఆర్ కాంప్లెక్స్ నుంచి డిఆర్ఎఫ్ ఆఫీసు, అల్లిపురం కెప్టెన్ రామారావు జంక్షన్, రామకృష్ణ జంక్షన్, దుర్గాలమ్మ గుడి, పోలీస్ బ్యారెక్స్, జగదాంబ సెంటర్, డాబా గార్డెన్స్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ బైకు ర్యాలీ సాగింది.

పాదయాత్ర

ఎంవిపి.కాలనీ : చలో ఢిల్లీని జయప్రదం చేయాలంటూ సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంవిపి రైతు బజార్ నుంచి డిఆర్‌డిఎ కార్యాలయ సర్కిల్ వరకూ పాదయాత్ర చేపట్టారు. సంఘం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడారు. నాయకులు ఆర్.శ్రీను, కొండమ్మ, అనపర్తి అప్పారావు, ఎం.చంటి, జివిఎంసి 17, 18 వార్డుల కార్మికులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీపై విస్తృత ప్రచారం

మునగపాక రూరల్ : మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మునగపాక ప్రాథమిక సహకార సంఘం ఫంక్షన్ హాలులో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగితేలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు పార్వతి, నాయకులు పద్మ, కుమారి, పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

కశింకోట : సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎం.శ్రీదేవి ఆధ్వర్యాన మండలంలోని తేగాడ గ్రామంలో శుక్రవారం చలో ఢిల్లీపై కరపత్ర ప్రచారం చేశారు. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ రైతుల ఆత్మహత్యలు చేసుకొనే విధంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. చెరుకు ఫ్యాక్టరీలను ఆధునికీకరించి చెరుకు రైతులకు బకాయిలను చెల్లించాలని కోరారు.

పరవాడ : సిఐటియు ఆధ్వర్యంలో సింహాద్రి ఎన్‌టిపిసి మెయిన్ గేట్ వద్ద చలో ఢిల్లీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌టిపిసిలో కాంటాక్ట్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిపిసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి ఎం.సత్యనారాయణ, నాయకులు డి రామారావు, ఆర్.సన్యాసిరావు, ఎస్ రామారావు, చందర్రావు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

దేవరాపల్లి : ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ వాల్ పోస్టర్లను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బిటి.దొర ఆధ్వర్యాన మండలంలోని వాలాబు పంచాయతీ ఇప్పగురువులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి 200 పని దినాలు, కనీస వేతనం రోజుకు రూ.600 కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బల్జి గణేష్, కదల రాము, ఇరుట గోపాలుడు, పంది శ్రీరాములు, కాదల అచ్చిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : ముఠా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అనకాపల్లి ముఠావర్కర్ల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక పార్సిల్ ముఠావర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ముందుగా చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ బోర్డు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ ఫలాలు అందక వృద్ధాప్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బోడి రాజు, రుత్తల అప్పలనాయుడు, మజ్జి సీతారాం, బోడి రామునాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండ మండల కేంద్రంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డగోలుగా అమ్మేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణముర్తి మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. సాగు చేస్తున్న దళిత, గిరిజన, బడుగు బహీన వర్గాల రైతులకు పట్టాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో విఓఎ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, రామారావు, గణేష్, చిట్టిబాబు, వాసు తదితర్లు పాల్గొన్నారు.



అనకాపల్లి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఠా కార్మికులు



ఎంవిపి కాలనీలో...



కశింకోట మండలంలో..



దేవరాపల్లి మండలంలో..



పరవాడలో...



మునగపాకలో...



మల్కాపురంలో...



పెందుర్తిలో...



చిరు ధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : చిరుధాన్యాలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ హారిక చెప్పారు. రామన్నపాలెం గ్రామంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె చిరుధాన్యాలు ప్రాముఖ్యతపై ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు తీసుకోవడం వలన బిపి, షుగర్, శ్వాస కోస, గుండె సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. దీనిలో భాగంగా వంటల పోటీలు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీను, అంగన్వాడీ టీచర్ పద్మ, పోషణ సఖి అనూష పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లి అంగన్వాడీ కేంద్రం-4లో శుక్రవారం టాటా ట్రస్ట్, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కోఆర్డినేటర్ సిహెచ్ భాగ్యలక్ష్మి, పోషణ సఖి అనురాధ మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంలో ఏదో రూపంలో తీసుకోవాలన్నారు. అనంతరం టాటా ట్రస్ట్ వారు చిరుధాన్యాలపై పెట్టిన వంటల పోటీలలో దీపిక, వెంకట్ లక్ష్మి, డి లక్ష్మి, ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతాడ దేవి, ఏఎన్ఎం వి పద్మ, ఎంఎల్‌హెచ్‌పి జి ఆశాజ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతి, పద్మ, లక్ష్మీ, కామేశ్వరి, ఆశాలు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి తదితరులు

పార్కు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొత్తూరు పంచాయితీలోని ఎర్ర చెరువును అనుకొని 7.68 ఎకరాల డంపింగ్ యార్డ్ స్థలంలో అధునాతన పార్కును ఏర్పాటు చేసేందుకు మంత్రి గుడివాడ అమర్నాథ్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందమైన ఉద్యాన పార్కు, 40 అడుగుల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణానికి లారస్ ల్యాబ్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జెడ్‌పి ఉపాధ్యక్షురాలు బివి సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ జోసెఫ్, వైసిపి నాయకులు భీశెట్టి జగన్, మందపాటి జానకి రామ రాజు, జాజుల రమేష్, గొల్లవిల్లి శ్రీనివాసరావు, లారస్ ల్యాబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీనివాస పట్నాయక్

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎస్ శ్రీనివాసపట్నాయక్, కార్యదర్శిగా కూనిశెట్టి శ్రీనివాస్ ఎన్నికైనట్లు బార్ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- వద్దాది : బుచ్చయ్యపేట మండలం ఎల్బిపి అగ్రహారంలో శుక్రవారం వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు డాక్టర్ ఆర్ వెంకట్రావు ఆధ్వర్యంలో 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 22 మందికి ఏప్రిల్ 27వ తేదీన ఆపరేషన్ చేస్తామని, 44 మందికి కళ్లద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు, మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమరాన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శిరిగిరిశెట్టి నానాజీ, తమరాన వెంకటరమణ, మీసాల మోహన్‌రావు, ఎంపీటీసీ ఎల్లపు జగ్గారావు, ఏఎన్ఎం ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పి హేమలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలం తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి ఉమాశంకర్, ఉప్పు అజయ్ కుమార్, స్వామి నాయుడు, ఆదినారాయణ, రంది వెంకటరావు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో జి.భీమవరం గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయ డిపిఎమ్ లచ్చన్న మాట్లాడుతూ సిబ్బంది ఏ గ్రామంలోనూ కెమికల్ కనిపించకుండా చర్యలు తీసుకోవాలని, కనిపిస్తే అక్కడ సిబ్బందిని తొలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామినాయుడు, గోవిందు, వర్మ, అనిత, అప్పలరాజు పాల్గొన్నారు.

మూలపేటలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్టిపి ఈశ్వరరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. పీహెచ్సీ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తోటాడ మాజీ సర్పంచ్ బి శెట్టి పైడికొండ, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి మోహన్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కశింకోట మండల సమావేశం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల సమావేశం శనివారం ఉదయం 10 గంటలు జరుగుతుందని ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ పాల్గొంటారని, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, సర్పంచ్‌లు, ఎమ్‌పిటిసిలు, సంబంధించిన అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు

టైలరింగ్‌తో మహిళల ఆర్థిక భరోసా

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళల ఆర్థిక స్వావలంబనకు టైలరింగ్ చేయూతనందిస్తుందని జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో శుక్రవారం రెడీమేడ్ లోకంలో టైలర్ల ప్రాధాన్యత అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్ల ప్రాధాన్యత తగ్గిందన్నారు. సీనియర్ జర్నలిస్టు వేగి రామచంద్రరావు మాట్లాడుతూ చిన్న తరహా నుంచి భారీ పరిశ్రమగా టైలరింగ్ అనుబంధ వ్యవస్థను విస్తరించడానికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని చెప్పారు. అనంతరం వేగి రామచంద్రరావు, జోనల్ కమిషనర్ వెంకటరమణను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక అప్పారావు, కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారి భీశెట్టి కృష్ణ అప్పారావు, కాండ్రేగుల జగ్గారావు, జగ్గప్పారావు, కర్రి హనుమంతరావు పాల్గొన్నారు.

పోలవరం ఎత్తు తగ్గిస్తే ఉత్తరాంధ్ర ప్రజలు సహించరు

గోవిందరావు శతజయంతి సభలో జెవి

ప్రజాశక్తి-అనకాపల్లి

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే ఉత్తరాంధ్ర ప్రజలు సహించరని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి హెచ్చరించారు. స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో శుక్రవారం మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ కోడిగంటి గోవిందరావు శతజయంతి సభ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం తన ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా గోవిందరావు త్యజించిన విషయాన్ని గుర్తు చేశారు. తన 70 ఏళ్ల వయసులో కూడా భూ పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. కామ్రేడ్ గోవిందరావు శతజయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు పార్టీ నిర్ణయించిందని చెప్పారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ తాను విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే కామ్రేడ్ గోవిందరావు గురించి తెలుసని తెలిపారు. నాలుగు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి అనేక ప్రజా సమస్యలపై ఉద్యమించి పరిష్కరించారని తెలిపారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు కమ్యూనిస్టుగానే పని చేశారని కొనియాడారు. గోవిందరావు కుమారులు డాక్టర్ శరత్ చంద్ర, రవి మాట్లాడుతూ తమ తండ్రి నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధతతో పని చేశారన్నారు. తమ కుటుంబం కంటే పార్టీకే అంకితమై పనిచేశారని తెలిపారు. ప్రజలపై ప్రేమ లేనివాడు కమ్యూనిస్టు కాజాలడన్నారు. సిపిఎం సిపిఐ ఏకమై ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. ముందుగా స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో ఉన్న గోవిందరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏ.బాలకృష్ణ, గంట శ్రీరామ్, జి.కోటేశ్వరరావు, సిపిఐ నాయకులు రావు జగ్గారావు, రాజాన దొరబాబు, రామునాయుడు, విమల, వైఎన్ భద్రం, మల్ల మాధవరావు, గురుబాబు, అప్పలరాజు, డిసిహెచ్ క్రాంతి, కొండలరావు, అర్జున్, కోన లక్ష్మణ, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నేత జెవి.సత్యనారాయణమూర్తి, చిత్రంలో సిపిఎం నేత లోకనాథం

వర్గీకరణ హామీని అటకెక్కించిన బిజెపి ప్రభుత్వం



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని మాదిగలకు హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం గెలిచిన తర్వాత ఆ మాటే మరిచిందని ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు కొల్లి చిన్న అప్పారావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నమ్మకద్రోహానికి నిరసనగా శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జిల్లా ఇన్చార్జ్ ఏలుసూరి ఘాటీలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆరుగుళ్ళ రాజబాబు, అనకాపల్లి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు కట్టమూరు మంగరాజు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం ఎస్సీ వర్గీకరణ చేసి పార్లమెంటుకు పంపినట్టే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎస్సీ వర్గీకరణ చేసి పార్లమెంటుకు పంపాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌వో వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక మల్లి బాబు, ఎత్తుల అప్పారావు, చెవ్వేటి నాగరాజు, ఎం సతీష్, కొల్లి రామాంజి, కాకినాడ కనకేశ్వరరావు, గొట్టివాడ సామ్రాట్ కుమార్, కనక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఇవ్వాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి ఆధార్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో ఆధార్ నమోదు నిర్వహించాలన్నారు. ఐదు సంవత్సరాలు దాటిన వారికి బయోమెట్రిక్ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి సమన్వయంతో ఆధార్ కార్డులు నమోదు చేయాలని జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారిణి మంజులవాణి ఆదేశించారు. అధికార, అనధికార కార్యక్రమాలకు ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆధార్ స్టేట్ టీమ్ మెంబర్ గిరిధర్ ఆధార్ నమోదు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ హేమంత్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉషారాణి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, పోస్టల్ సూపరింటెండెంట్ జె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి, అధికారులు

సొసైటీ ద్వారా రైతు సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : గౌరీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షులు కాండ్రేగుల కృష్ణ అప్పారావు పేర్కొన్నారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పీవీ రమణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 1997లో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సహకారంతో సొసైటీకి సొంత భవన నిర్మాణం జరిగిందని, నాటి నుంచి రైతులకు కావలసిన ఎరువులు, వ్యవసాయ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంఘం ప్రత్యేక ముఖ్య కార్య నిర్వహణ అధికారి బుద్ధ త్రిమూర్తి, సొసైటీ పాలకవర్గ సభ్యులు మల్ల అప్పలనాయుడు, కర్రి మోదినాయుడు, కార్యదర్శి పి ఈవి ప్రసాదరావు, కొణతాల సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి ఆయుష్ విభాగం వైద్యులు లావణ్య పేర్కొన్నారు. స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆయుర్వేద వైద్యం అనాదిగా వస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిబి ముందుగా గుర్తించడం లక్షణాలపై టీబి హెచ్ వి కె వెంకటలక్ష్మి వివరించారు. అనంతరం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రీ గంగాధర్, ఎడాల్సింట్ కౌన్సిలర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న రాయపురెడ్డి కృష్ణ

పైడితల్లమ్మ పండగకు విరాళం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలం గొల్లల పాలెంలో ఏప్రిల్ 4న జరుగుతున్న పైడితల్లమ్మ అమ్మవారి పండుగకు జనసేన పార్టీ మాడుగల నియోజకవర్గ నాయకులు రాయపురెడ్డి కృష్ణ రూ.10,116 విరాళాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఉత్సవాలకు, క్రీడా పరికరాలకు కొనుగోలుకు, సాంస్కృతిక కార్యక్రమాలకు జనసేన పార్టీ ఆర్థికంగా సహకరిస్తుందని చెప్పారు. విరాళం అందించిన కృష్ణకు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొట్ట పాలవెల్లి, కడుపుట్ల రామనాయుడు, చుక్కా నారాయణమూర్తి, ముత్యాల నాయుడు, సింహాద్రి, ఈశ్వరరావు, నూకరాజు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవాలి

ప్రజాశక్తి - అనకాపల్లి : విద్యార్థులకు పదో తరగతి అత్యంత కీలకమని, ఈ దశలో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేయాలని అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ కుమార్ సూచించారు. స్థానిక మహాత్మ జ్యోతీరావుపూలే గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తమ అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ అందరి సమిష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించడంలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారం అందించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎంపిపి గొర్లి సూరిబాబు హెచ్చరించారు. మండలంలోని తుమ్మపాల గవరపేట వీధి అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ ఏఈ కుమార్ రాజా, వైసిపి నాయకులు దంతులూరి కళ్యాణ చక్రవర్తి, ఎంపీటీసీ సభ్యుడు పంచదార్ల కన్నారావు, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, ఆర్టీసీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హస్తినాపురంలో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి -పరవాడ : మండలంలోని నాయుడుపాలెం పంచాయితీ హస్తినాపురం గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ వి ప్రకాశరావు హాజరై గ్రామంలో అణగారిన వర్గాలకు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుందర్ రావు, ఈవో ఆర్డీ పద్మజ, పి ఈశ్వరరావు, సర్పంచు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు



నినాదాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-మాడుగుల: బోయ,వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై శుక్రవారం మండలంలోని గిరిజనులు నాన్ షెడ్యూల్ ఏరియా 5వ కమిటీ సాధన సమితి జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి అధ్వర్యంలో మండలంలోని పలు గిరి గ్రామాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దుర్మార్గమని విమర్శించారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్(విశాఖ) : బోయ/వాల్మీలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఖండిస్తూ శుక్రవారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులు డిప్పల సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి రూఢ సత్యారావు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బోయ/వాల్మీలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ తీర్మానం చేయడం దారుణమన్నారు. శుక్రవారం జరిగిన మన్యం బంద్‌కు మద్దతుగా తాము విశాఖ నగరంలో ఈ కార్యక్రమం



నినాదాలు చేస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

చేపట్టినట్టు తెలిపారు. జిఒ నెంబరు 3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీచేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షను గుర్తెరగని గిరిజన ఎమ్మెల్యేలు రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు.



సామగ్రిని ఇస్తున్న క్లబ్ సభ్యులు

పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి నర్సీపట్నం రూరల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి) పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని రోటరీ క్లబ్ సభ్యులు సుతాపల్లి శ్రవణ్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదివి పది ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. మిడ్డేమిల్స్ కు అవసరమైన 50 కేజీల రెండు గిన్నెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రమణ, ఉపాధ్యాయులు డి.నూకరాజు, శ్రీనివాస్, ఎల్.సుగుణ, గాయత్రి, మూర్తి, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఓమ్మి మాధవి పాల్గొన్నారు.

కూలిన ఇల్లు

ప్రజాశక్తి- కోటవురట్ల: అన్నవరం గ్రామంలో శుక్రవారం ఉదయం అయ్యప్పరెడ్డి వరాహాలమ్మకు చెందిన పెంకుటిల్లు కూలి పోయింది, ఇటీవల కురిసిన వర్షాలకు కూలి పోవడంతో నిరాశ్రయురాలయింది. స్థానిక సర్పంచ్ సుబ్బలక్ష్మి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో శుక్రవారం సాయంత్రం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉద్దవరావు, గ్రామ రెవెన్యూ అధికారి ఆశా, కూలిన ఇంటి పరిశీలించారు. బాధితురాలని రెవెన్యూ అధికారులు ఆదుకోవాలని సర్పంచ్ కోరారు.



తూతూ మంత్రంగా .. సామాజిక తనిఖీలపై అసహనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల పరిషత్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి సహా పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీ, సర్పంచ్ లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అడిషనల్ పీడీ రోజా రమణి ఆధ్వర్యంలో జరిగిన 15వ ప్రజా వేదికలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన సుమారు రూ.16 కోట్ల పనులకు సంబంధించి నిర్వహించిన తనిఖీలను ప్రజా వేదిక ద్వారా తెలియజేశారు. తనిఖీలు నిర్వహించే సమయంలో ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వలేదని ఏపీడి దృష్టికి తీసుకువెళ్లారు. కోటవురట్ల ఎంపీటీసీ సభ్యులు టీవీ సూర్యారావు మాట్లాడుతూ, ఏవెన్యూ ప్లాంటేషన్ పట్ల వృధాగా ప్రజాధనం ఖర్చు చేస్తున్నారని అధికారులు గుర్తించాలన్నారు. జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులు రైతు అవసరాలకు ఉపయోగపడే విధంగా చేపట్టాలని ఎన్నిసార్లు ఉపాధి సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని వెల్లడించారు. సర్పంచ్ శివరాం, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు మాట్లాడుతూ, గ్రామాల్లో జరిగిన పనులపై తూతూ మంత్రంగానే తనిఖీలు నిర్వహించినట్లు ప్రజా



ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులు

వేదిక దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం నిర్వహించిన, వివిధ పనుల తనిఖీల వివరాలు ప్రజావేదికలో వెల్లడించారు. ప్రజావేదికకు పూర్తిస్థాయిలో అధికారులు, నాయకులు హాజరు కాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డివిప నిర్మలాదేవి, తహసిల్దార్ జానకమ్మ, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఎంఈఓ అప్పారావు, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పిఆర్‌ఏ ఈ వర్మ, ఏపీవో గంగు నాయుడు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

ప్రజాశక్తి -కొత్తకోట: చిరుధాన్యాలతో కూడిన ఆహారంలో అధికంగా పోషకవిలువలు వుంటాయని క్రమం తప్పకుండా గర్భిణీలు, బాలింతలు తీసుకోవాలని కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఐసిడిఎస్ సిడిపిఒ పుష్పదేవి సూచించారు. ఫోషన్ పక్వాడా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కొత్తకోట సెక్టార్ పరిధిలో స్థానిక హైస్కూల్‌లో గర్భిణీలకు, బాలింతలకు, కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికహారాన్ని తప్పనిసరిగా తీసుకుంటే రక్తహీనత నివారించ ˊవచ్చునన్నారు. రక్తహీనతతో పలు అనర్థాలు సంభవిస్తున్నాయని, ఇందుకోసం ఐరన్ మాత్రలతో పాటు, మంచి పోషక విలువలు ఆహారం తీసుకోవాలని పిహెచ్‌సి హెచ్‌ఎస్ వి.మల్లిబాబు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు చిరు ధాన్యాలు గల కొర్రలు, గంటెలు, రాగులు, గోధుమలు, సామలు, సెనగలు, తదితర స్టాల్స్ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవా, ఎంపిటీసీలు పూడి దేవా, కుంచాలక్ష్మి శంకరరావు, పైల చినమ్మలు, హైస్కూల్ హెచ్‌ఎం డి.సత్యారావు, సూపర్వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -కొత్తకోట: ఓటర్ జాబితాకు ఆధార్ లింక్ పనులు వేగవంతం చేయాలనీ రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు అన్నారు. మండలంలో దొండపూడి గ్రామ సచివాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికం గా సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, స్థానిక సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించ లేదని పిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఓలు అందు బాటులో ఉండాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించా రు. గ్రామ స్థాయిలో పరిష్కా రం కానీ సున్నితమైన సమస్యలను తమ దృష్టికి తేవాలని తహసీల్దార్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చినబ్బాయి, సతీష్ పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవ సభ

రావికమతం మండలం గొంప గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవ సభ నిర్వహించారు. తహసీల్దార్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్సి కాలనీ లో కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, గ్రామంలో సామాజిక సమస్యలకు చోటు లేకుండా అందరూ ఒకటిగా ఉండాలన్నారు. కుల మత, వర్గ బేధం సోదర భావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కండ్రీడ్డి గోవింద్, ఆర్ఐ చినబ్బాయి, సతీష్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్

నేటి నుంచి ఉపమాకలో

శివపార్వతుల ఉత్సవాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక లో భువనేశ్వరి దేవి సమేత లక్ష్మణేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు శివపార్వతుల వార్షిక కళ్యాణ మహోత్సవములు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, అర్చకులు మహేష్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, శనివారం ఉదయం ఆలయంలో గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవాచనం, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు నక్కపల్లిలో కీర్తిశేషులు మైలవరభట్ల జోగారావు నివాసం వద్ద వేదపండితురాలు గొట్టుముక్కల గాయత్రీదేవిచే ఎదురు సన్నాహ మహోత్సవం జరుగుతుందని, రాత్రి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించునున్నట్లు తెలిపారు. 2న కుంకుమ పూజ, 3న సదస్యం, 4న తోటోత్సవం, 5న మహాపూర్ణాహుతి, మద్యాహ్నం అన్న సమారాధన,రాత్రికి పుష్పయాగోత్సవం పవళింపు సేవ వంటి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధం చేసినట్లు చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు.



లక్ష్మణేశ్వర స్వామి ఆలయం



షూటింగ్ తీస్తున్న యూనిట్ సభ్యులు

కోనాంలో షూటింగ్ సందడి

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలో కోనాం గిరిజన గ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో మన్యం ధీరుడు సినిమా షూటింగ్ శుక్రవారం ప్రారంభ మైంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజ దేశం కోసం, స్వాతంత్ర్యం కొరకు చేసిన త్యాగాలను ఆర్‌ఆర్ మూవీ క్రియేషన్స్ సినిమా చిత్రీకరణ చేస్తున్నట్లు సీతారామ రాజు పాత్రధారుడు ఆర్ వి వి సత్యనారాయణ తెలిపారు. ఈ సినిమాకి డి.నరేష్ దర్శకత్వం చేస్తున్నట్లు ఆయన అన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న నారాయణరావు

'దహనం' విడుదల

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్: ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత సతీష్ కుమార్ నిర్మించిన 'దహనం' తెలుగు సినిమాను శుక్రవారం స్థానిక పీవీఆర్ సినీ కాంప్లెక్స్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాలో నటించిన వ్యాపారవేత్త వెలగా నారాయణరావు కుటుంబ సభ్యులు, నవ్య లైన్స్ క్లబ్, సిమెంట్ ఐరన్ షాప్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో పోస్టర్ విడుదల చేసి కేక్ కట్ చేసారు. సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

నేడు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-గొలుగొండ: ఈనెల 1వ తేదీ శనివారం సాయంత్రం గొలుగొండ మండలం పుత్తడిగైరంపేట, పాకలపాడు గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యమ్రకం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరు కానున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

'రెల్లి మహిళా హక్కుల సాధన' జిల్లా అధ్యక్షురాలు మౌనిక



ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: రోలుగుంట కేజీబివి ప్రిన్సిపాల్, సిబ్బందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని రెల్లి మహిళా హక్కుల సాధన కమిటీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షురాలు యర్రంశెట్టి మౌనిక డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రోలుగుంట కేజీబివిలో 9వ తరగతి చదువుతున్న గిరిజన బాలిక తుర్రే చిన్నారి మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. కస్తూరిబా హాస్టల్లో చదువుతున్న బాలిక చిన్నారి మృతిపై ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు అర్థమవుతుందన్నారు. ఆ బాలిక హాస్టల్లో లేదనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని, ఆ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారి మృతికి కారకులైన వారందరిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమితో పాటు 10లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఇటువంటి సంఘటన కూడా పునరావృతం కాకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.



ర్యాలీ చేపడుతున్న నాయకులు

దళితుల ర్యాలీ

ప్రజాశక్తి -పాయకరావుపేట: దళితులపై దాడులను నిరసిస్తూ పాయకరావుపేట చిత్ర మందిర్ థియేటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కష్ణ స్వరూప్ ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరంతరం దళితుల పైన దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. తొండంగి మండలం. శంఘవక్షం గ్రామంలో దళిత యువకుడు రాము నూ చంపారన్నారు. ఈ కేసులోని నిందుతులను రక్షించడానికి అధికార పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేస్తుందరని ఆరోపించారు.ఈ కార్యక్రమం లో పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, పార్టీ కాకినాడ జిల్లా ఇంచార్జ్ రాజాల నాగేశ్వరావు, మాల మహానాడు తుని అసెంబ్లీ కో. ఆర్డినేటర్ మార్తి సింహాచలం, స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ పెదపాటి నూకరాజు, ఎస్సీ. ఎస్టీ. బీసీ. మైనార్టీ సంఘాల ఐక్య వేదిక తుని మండలం శాఖ అధ్యక్షులు ఈలపు. నాగబాబు, .ఐక్య వేదిక మండలం కన్వీనర్ తాటిపర్తి అప్పారావు యాదవ్ పాల్గొన్నారు.



సన్మానం పొందిన కళాకారులు

కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయంలో గురువారం రాత్రి శ్రీనివాస భక్త సమాజ కళాకారులకు ఘనంగా సన్మానించారు. ఉపమాక వెంకన్న ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు తన సోదరుడు, కీర్తిశేషులు మనవాళ్లస్వామి జ్ఞాపకార్థం భజన సమాజ కళాకారులకు శాలువా కప్పి ,వస్త్రాలను అందజేశారు. వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, శేషాచార్యులతో కలిసి కళాకారులకు ఆశీర్వచనం చేశారు. సప్తాహం నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన భజన సమాజ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

విద్యలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి నాగర్జున

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కొక్కిరాపల్లి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటించి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నామని, నాణ్యమైన భోజనం, విద్యార్థులకు టాబ్‌లు, యూనిఫారం అందిస్తున్నామని తెలిపారు. ఆంగ్ల భాషను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మంత్రికి వినతి పత్రం అందజేసి సకాలంలో పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటకృష్ణతార, ఎంపిపి బోదెపు గోవింద్, మాజీ ఎంపిపి బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్ దూది నరసింహమూర్తి, సిఐ గఫూర్, ఎస్ఐలు సన్నిబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలో విద్య మెరుగుపడిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున అన్నారు. ఎస్సీ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నాగర్జున మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యాభివద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు.నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడం జరిగిందన్నారు. మౌలిక వసతులతో కూడిన విధంగా పాఠశాలల నిర్మాణాలను సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు .కార్పొరేట్ విద్యా వ్యవస్థకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టల్లు ఉన్నాయని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం ద్వారా బోధించడం జరుగుతుందన్నారు.విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగే విధంగా విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. సమయం వృధా చేయకుండా కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పౌష్టిక ఆహారం అందించాలన్న సంకల్పంతో స్వయంగా సీఎం జగన్ మెనూ రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ జయ రత్నకుమారి, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, డిసిఓ రూపవతి, ఎంపీడీవో సీతారామ రాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఈశ్వరరావు, వైసిపి నాయకురాలు శేషారత్నం, ఉపసర్పంచ్ రాజు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ స్థలం పరిశీలన

నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ స్థలాన్ని శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున పరిశీలించారు. సర్వే నెంబర్ 322/1బి లో 3 ఎకరాలు ఎస్సీ కార్పొరేషన్ సంబంధించిన స్థలం ఉంది. ఈ మేరకు స్థలానికి సంబంధించిన మ్యాప్ ను తహసిల్దార్ నీరజ మంత్రికి చూపించారు. స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు .

ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్: ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డివి సత్యనారాయణ కోరారు. విజయలక్ష్మి దుర్గ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అన్ని రంగాల వత్తిదారులకు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లకు వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను చర్చించుకునేందుకు కమ్యూనిటీ భవనానికి స్థలాన్ని మంజూరు చేయాలన్నారు.కోవిడ్ సమయంలో పనులు లేక ఆర్థికంగా చితికిపోయిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు మండవ కుటుంబరావు, ఉపాధ్యక్షులు కే.పాల్ రాజు, ప్రధాన కార్యదర్శి కే.శ్రీహరిరావు, కార్యదర్శి బి.మాదన్న, కోశాధికారి ఎం.శ్రీధర్ రవిబాబు, రాష్ట్ర కన్వీనర్ రమణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కనికెళ్ల కోటేశ్వరరావు, స్థానిక నాయకులు లంక వీరాపాత్రుడు, దేశెట్టి సత్యనారాయణ, బ్రహ్మాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

ఎన్ఎంఎంఎస్‌కు రాజు ఎంపిక



ప్రజాశక్తి-గొలుగొండ:జోగుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి బుంగా యశ్వంత్ రాజు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ కు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనపరిచి పాఠశాల ప్రతిష్టను పెంచాడని పాఠశాల హెచ్ఎం వి.సరోజినీ చెప్పారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ప్రయోజక స్థానాల్లో ఉన్నారన్నారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: వేసవి నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పించాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఓ వీడియోలో కోరారు. రాష్ట్రంలో సుమారు 98 లక్షల మందికి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్నాయని, ఇందులో రోజూ పనికి వెళ్ళేవారు సుమారు 55 లక్షల మంది వరకూ ఉంటారన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా చూసుకుంటే సుమారు 6 లక్షల మంది జాబ్ కార్డు దారులు రోజు పనులు చేస్తున్నారని, వీరికి ఎండలకు వడదెబ్బ తగలకుండా సౌకర్యాలు కల్పించ లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో టెంట్లు, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు అందించేవారమని, ఎమర్జెన్సీ మెడికల్ కిట్లు కూడా అందుబాటులో ఉండేవని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టెంట్లు, మజ్జిగ ప్యాకెట్లు, కనీసం వాటర్ ప్యాకెట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. అత్యవసర సమయాల్లో ఎమర్జెన్సీ మెడికల్ కిట్లు కూడా అందుబాటులో ఉంచలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. జిల్లా అధికారులు కూడా ఎవరూ పట్టించుకోలేదన్నారు.తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సమ్మర్ అలవెన్స్ కింద ఫిబ్రవరి నెలలో 20 శాతం, మార్చి నెలలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్ నెలలో 20 శాతం అధికంగా డబ్బులు ఇచ్చేవారని, ఇప్పుడు అది కూడా ఆపేశారన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:అనకాపల్లి జిల్లా గొలుగొండ మండల అల్వేస్ అధర్ ఫర్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.కిషోర్ ఆధ్వర్యంలో గొలుగొండ ఎస్సీ కాలనీ చెందిన బండారు కిషోరు ప్రమాదానికి గురవడంతో కుటుంబ పోషక నిమిత్తం ఒక నెల సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోగంపేట చెందిన యూత్ గుడివాడ సాయి, సుర్ల కృష్ణంనాయుడు, గుడివాడ నరసింహా నాయుడు, కుప్పరాల కన్నబాబు పాల్గొన్నారు.



సరుకులు ఇస్తున్న సంస్థ సభ్యులు

పౌర హక్కులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.అప్పారావు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డేవిడ్‌రాజు మాట్లాడుతూ, పౌరులు గ్రామ పంచాయతీలో ఎటువంటి సమస్యలు ఉన్న నిర్భయంగా తెలియజేయ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ, వీఆర్వోలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.